క్లుప్తంగా

వ్యాన్ బోల్తా -డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన వ్యాన్

దగదర్తి: మండల పరిధిలోని అల్లూరు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఫినాయిల్ లోడుతో కావలి వైపు అధిక వేగంతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి శనివారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. కాగా జాతీయ రహదారిపై గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు హైవే మొబైల్ సిబ్బంది సాయంతో వ్యాన్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అల్లూరు రోడ్డు రైల్వే వంతెన వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత



సంగం: మండల పరిధిలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసు, మత్స్యశాఖల అధికారులు శనివారం పట్టుకున్నారు. వాహనంలోని 12 డ్రమ్ముల్లోని చికెన్ వ్యర్థాలను సంగం కొండ సమీపంలో గుంతతీసి పూడ్చివేశారు. వాహనంపై కేసు నమోదు చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 389 బేళ్లను వేలానికి తీసుకురాగా, 307 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.243.62 ధర లభించిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయి.

డీసీపల్లిలో 400 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 400 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 573 బేళ్లు రాగా, 400 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.248.11 ధర లభించిందని వివరించారు. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ ఆజాంఖాన్

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడులో ఉపాధి పనులను ఏపీఓ ఆజాంఖాన్ శనివారం పరిశీలించారు. ఫారంపాండ్ కొలతలు, మస్టర్లను తనిఖీ చేసి కూలీలను అడిగిఎంత సేపు పనిచేస్తే ఎంత నగదు వస్తుందని తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా కనీసం నాలుగు గంటలు పనిచేయాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భజలాలను పెంచుకోవచ్చని తెలిపారు.

నేడు క్రీడాకారులకు సన్మానం

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌జేడీ కళాశాలలో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కళాశాల పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి చాంపియన్‌షిప్‌ను సాధించిన, విక్రమసింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను సీఐ గంగాధర్ చేతుల మీదుగా సత్కరించనున్నట్లు వివరించారు.

ఇన్‌చార్జి ఏపీఎంగా కృష్ణారావు

ఉదయగిరి: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఇన్‌చార్జి ఏపీఎంగా పీ కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేస్తున్న ఖాజారంతుల్లా నెల్లూరు డీఆర్‌డీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కావలి ఏపీఎంగా పనిచేస్తున్న కృష్ణారావును ఇన్‌చార్జిగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు.

వర్షం పడితే నరకమే

- అధ్వానంగా పాతదేవరాయపల్లి-వెంగంనాయుడువల్లి రోడ్డు
- చినుకుపడితే బురదమయంగా మారుతున్న మట్టిరోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు, రైతులు
- రెండున్నర కిలోమీటర్ల దూరం సీసీరోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి



దేవరాయపల్లి-కచేరిదేవరాయపల్లి మధ్యన బురదమయంగా రోడ్డు



పాతదేవరాయపల్లి-కచేరిదేవరాయపల్లి మధ్యన ఉన్న చవటవాగు

సోమశిల: అనంతసాగరం మండలంలోని పెన్నా పరివాహక ప్రాంత గ్రామాలైన కచేరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాతదేవరాయపల్లి నుంచి కచేరిదేవరాయపల్లి మీదుగా వెంగంనాయుడుపల్లి వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు ఉంది. వర్షం పడితే అది బురదమయంగా మారుతుండడంతో రాకపోకలు సాగించేందుకు రెండు గ్రామాల ప్రజలతో పాటు ఆ మార్గంలో పొలాలు కలిగిన రైతులు నరకాన్ని చవిచూస్తున్నారు.

పెన్నా వస్తే కష్టాలే

పెన్నా పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలకు వరద ముప్పు అవకాశాలు ఉంటాయి. గ్రామాల నుంచి బయటపడేందుకు సరైన రోడ్డు వసతి అవసరం. సరైన రోడ్డు సౌకర్యం లేని కారణంగా కచేరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి గ్రామాల ప్రజలు పెన్నా వరదల సమయంలో బయటపడేందుకు అవస్థ పడుతున్నారు. గతంలో పెన్నాకు వరద వచ్చిన సమయంలో ఇటు పాతదేవరాయపల్లికి వచ్చే మార్గంలో చవటవాగు పొంగడం, అటు కొత్తపల్లి మార్గంలో కొమ్మలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో పడవల సాయంతో బయటపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు కచేరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి గ్రామాల ప్రజలు కొత్తపల్లి మీదుగా మండల కేంద్రమైన అనంతసాగరం చేరుకోవాలంటే 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అదే పాతదేవరాయపల్లి మీదుగా ఏడు కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. అందుకే అనంతసాగరానికి ఎక్కువగా పాతదేవరాయపల్లి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షకాలంలో మట్టిరోడ్డు బురదమయంగా మారి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కొత్తపల్లి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేయి ఎకరాలకు చెందిన రైతుల అవస్థ

పాతదేవరాయపల్లి నుంచి కచేరిదేవరాయపల్లి వరకు రెండు పంటలు పండే సుమారు 1000 ఎకరాల మాగాణి భూమి ఉంది. వర్షం పడితే మట్టిరోడ్డు చిత్తడిగా మారుతుండడంతో పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు రైతులు అవస్థ పడుతున్నారు. ప్రధానంగా ఎరువులు, పంట ఉత్పత్తులను తరలించేందుకు నానాపాట్లు పడుతున్నారు.

పరిష్కారం ఇలా..

పాతదేవరాయపల్లిలోని తుమ్మాలమ్మ ఆలయం వద్ద నుంచి కచేరిదేవరాయపల్లి వరకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రెండు గ్రామాల మధ్యన చవట వాగు ఉంది. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే రెండు గ్రామాల ప్రజలు, రైతులు దశాబ్దాలుగా వర్షాకాలంలో ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సీసీరోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం



నాకు నాలుగు ఎకరాల మాగాణి ఉంది. తమలపాకుల తోట కూడా ఉంది. పాతదేవరాయపల్లి-కచేరిదేవరాయపల్లి మధ్యన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారుతుండడంతో ట్రాక్టర్లు కూడా వెళ్లే పరిస్థితి ఉండడం లేదు. అధికారులు చొరవ చూపి సీసీరోడ్డు నిర్మించాలి.

– పొన్నా శ్రీను, కచేరిదేవరాయపల్లి

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఎల్లమ్మ విగ్రహానికి జలాధివాసం, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దద్దాల నారాయణ, ముల్లంగి శ్రీను హాజరవగా స్థానికులు ఘనంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. స్థానికులు పందిళ్ల మధు, వెంకటేశ్వర్లు, పాపయ్య, మాలకొండయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని ఆర్లపడియలో గురువారం నుంచి జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సీతారాములను ప్రత్యేక వాహనంలో పారువేటకు తరలించి ఉత్సవాలు ముగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

సీతారామపురం: మండలంలోని ఓగూరు వాండ్లపల్లిలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పారువేట ఉత్సవం నిర్వహించారు.

ఎన్‌కేబీసీని సందర్శించిన డీఎల్‌డీఏ చైర్మన్



గేదెలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

కొండాపురం: చింతలదేవిలోని నేషనల్ కామధేను పునరుత్పత్తి బ్రీడింగ్ సెంటర్, మిశ్రమగణాభివృద్ధి క్షేత్రాన్ని ఏపీ డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ శనివారం సందర్శించారు. క్షేత్రంలో పర్యటించి అక్కడి పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రంలోని జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.15 లక్షలతో కుంటను తవ్వించామని, ప్రస్తుతం కుంట కింద 30 ఎకరాల్లో గడ్డి సాగు చేస్తున్నట్లు తెలిపారు. రెండు పశుక్షేత్రాల ద్వారా ప్రతిరోజూ 200 లీటర్ల పాల దిగుబడి వస్తోందని, తద్వారా వచ్చే సంపద క్షేత్రం అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా క్షేత్రంలో పనిచేసే కూలీలు తమకు ఈపీఎఫ్ నగదు రావడం లేదని, వచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన ఆయన డైరెక్టరు దామోదర్ నాయుడిని కలిసి విన్నవించాలని సూచించారు. తాను కూడా సమస్యను డైరెక్టర్‌కు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. మిశ్రమగణాభివృద్ధి క్షేత్రంలో గొర్రెలు ఉంచేందుకు రెండు షెడ్లు అదనంగా కావాలని వైద్యులు కోరగా నిర్మాణానికి కృషిచేస్తామన్నారు.

4న పొట్టేళ్ల వేలం

మిశ్రమ గణాభివృద్ధి క్షేత్రంలోని 155 పొట్టేళ్లను జూన్ 4న వేలం వేయనున్నట్లు గొల్లపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. పొట్టేళ్లు కావాల్సిన రైతులు వేలంలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట స్థానిక వైద్యాధికారులు బలరామకృష్ణ, నాగరాజు, శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శనివారం అందజేశారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి 34 మంది విద్యార్థులకు రూ.3,41,500 నగదును అందజేశారు. ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో 596 మార్కులు సాధించిన చేజర్ల విద్యార్థిని ఆఫ్రీన్‌కు ప్రత్యేకంగా రూ.25వేల నగదు బహుమతిని అందజేశారు. పలువురు హెచ్‌ఎంలు, విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. ట్రస్ట్ సభ్యుడు విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నారాయణరావు, రవీంద్ర, గోవిందరెడ్డి, నరసింహారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

ఆత్మకూరు: పట్టణంలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి యువత మోటారు బైక్‌లపై హనుమాన్ జెండాలను ఏర్పాటు చేసుకుని ర్యాలీగా బయలుదేరి రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంటారని చెప్పారు. అనంతరం హనుమాన్ భక్తులను కలుపుకొని శోభాయాత్రగా ముందుకు సాగుతారని చెప్పారు. పట్టణంలోని మెయిన్‌బజార్, సత్రంసెంటర్, చావడి, హిల్‌రోడ్డు, సోమశిల రోడ్డు సెంటర్ల మీదుగా ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేటలకు చేరుకుంటారని చెప్పారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ మీదుగా రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంటారని వివరించారు. శోభాయాత్రలో హనుమంతుని భారీ విగ్రహం, సీతారామలక్ష్మణుల రథం, మహిళల కోలాట నృత్యాలు, భజన బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. శోభాయాత్ర అనంతరం రవితేజ కళ్యాణ మండపం వద్ద నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు. హనుమాన్ భక్తులు పెద్దఎత్తున శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బడులు తెరిచిన రోజే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



పుస్తకాలను పరిశీలిస్తున్న సీఎంఓ పెంచలయ్య

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలలను తెరిచిన రోజే విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేయనున్నట్లు సర్వశిక్ష అభియాన్ సీఎంఓ కే పెంచలయ్య తెలిపారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు 87 శాతం విద్యార్థి మిత్ర కిట్లు వచ్చాయని తెలిపారు. బ్యాగులు 1,61,959 రావాల్సి ఉండగా, 80వేలు వచ్చాయని చెప్పారు. పాఠ్య పుస్తకాలు 7,70,888 రావాల్సి ఉండగా, 6,61,683 వచ్చాయని చెప్పారు. బెల్టులు 1,15,54 రావాల్సి ఉండగా, 8,74,740 వచ్చాయని తెలిపారు. నోట్ పుస్తకాలు పూర్తిగా వచ్చాయన్నారు. బూట్లు, యూనిఫామ్ నెలాఖరు నాటికి వస్తాయని తెలిపారు. ఆయన వెంట సీఆర్‌ఎంటీలు శ్రీనివాసులు, మాల్యాద్రి, ఇనయతుల్లా ఉన్నారు.

ఆశీర్వాదం

కావలి (జలదంకి): మండలంలోని రుద్రకోట పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వాకా శ్రీనివాసులరెడ్డి కుమార్తె వివాహ వేడుక ఇటీవల జరగగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారి ఇంటికి శనివారం వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని జరిగిన వివాహ వేడుకలకు ఆయన హాజరయ్యారు.

ఉదయగిరి డిపో డీఎంకు పదోన్నతి

ఉదయగిరి: స్థానిక ప్రజారవాణా సంస్థ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం శ్రీనివాసరావుకు రీజనల్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఆయన్ని బాపట్ల జిల్లా రీజనల్ మేనేజర్‌గా నియమిస్తూ ప్రజారవాణా సంస్థ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయన రిలీవ్ కానున్నారు. ఆయనకు పలువురు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

చౌక దుకాణాల వద్దే సరుకులు పంపిణీ

అనుమసముద్రంపేట/చేజర్ల(ఆత్మకూరు)/జలదంకి: జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు ఏఎస్‌పేట, చేజర్ల తహసీల్దార్లు శ్రీరామకృష్ణ, పీ మురళి, జలదంకి డీటీ జూలీబాయి తెలిపారు. శనివారం వారు ఏఎస్‌పేట, చేజర్ల,జలదంకి మండలాల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు చౌకదుకాణాల వద్దే రేషన్ లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేయాలని సూచించారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా సిరాజుద్దీన్

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండల టీడీపీ అధ్యక్షుడిగా షేక్ సిరాజుద్దీన్‌ను నియమించినట్లు ఆ పార్టీ ప్రకటించింది. కాగా తనకు మండలాధ్యక్ష పదవి రావడానికి సహకరించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎం రఘునాథ్ తమ సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,45,000 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దగదర్తి: కామినేనిపాళెం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై జంపానికుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.20,310 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పొదుపు సభ్యుల జీవనోపాధులకు రుణ ప్రణాళికలు



మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసులు

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు సభ్యుల జీవనోపాధులకు ముందస్తు రుణ ప్రణాళికల తయారీపై వెలుగు ఏపీఎంలు, సీసీలతో బ్యాంకు లింకేజీ డీపీఎం కే శ్రీనివాసులు, జిల్లా యాంకర్ పర్సన్ భానుప్రసాద్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సభ్యులు బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించేలా చూడాలన్నారు. పొదుపు సభ్యులు కుటుంబ, వ్యాపార అవసరాల నిమిత్తం రుణాల కోసం బ్యాంకులకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. రుణాల్లో 30 శాతాన్ని గృహ అవసరాలు, 70 శాతం వ్యాపార రంగానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఉదయగిరి మండలంలో 886 గ్రూపులకు సంబంధించి ముందస్తు రుణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఉదయగిరి, సీతారాంపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

గోగులపల్లి పొలాల్లో తెలుగు శాసనం లభ్యం



అల్లూరు: మండలంలోని గోగులపల్లి పంట పొలాల్లో లభ్యమైన పురాతన శాసనాన్ని పదో శతాబ్దానికి చెందిన తెలుగు శాసనంగా ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. ఇటీవల పంట పొలాల్లో సాగుపనులు చేపడుతుండగా పురాతన శాసనం బయటపడింది. దాన్ని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్‌కు పంపించగా పదో శతాబ్దానికి చెందినదిగా గుర్తించారు. దానిపై అప్పటి తెలుగు లిపిలో స్వస్తి శ్రీహిరణ్యగర్భమురుత విపుల మహాదేవుడి పేరుతో ప్రేగ్గడ భాదపయ సల్లూరు గ్రామంలో శ్రీసాల (మేశ్వర) దేవుడిని స్థాపించడం, భూములను బహుమతిగా ఇవ్వడం గురించి లిఖించి ఉన్నట్లుగా గుర్తించారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్ చంద్రప్రియ, పీజీ విద్యార్థి కే సురేంద్రకుమార్‌రెడ్డి సౌజన్యంతో ఈ విషయాలను వెల్లడించినట్లు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఎపిగ్రఫీ విభాగం డైరెక్టర్ పేర్కొన్నారు.

లేగదూడలకు అందాల పోటీలు



లేగదూడలను పరిశీలిస్తున్న డీఎల్డీఏ చైర్మన్

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడలకు అందాల పోటీలను శనివారం నిర్వహించారు. డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నేటి లేగదూడలే రేపటి పాడిపశువులని తెలిపారు. అనంతరం పశుసంవర్ధక శాఖ అధికారులు మేలుజాతి లేగదూడల పోషణపై అవగాహన కల్పించారు. దూడలకు నట్టల నివారణ మందులు, పెరుగుదలకు కాల్షియం టానిక్, మినరల్ మిక్చర్‌ను అందజేశారు. అందాల పోటీల్లో గెలుపొందిన లేగదూడల యజమానులకు బహుమతులు పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఈఓ శ్రీనివాసులు, ఏడీఏ సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

దేవ్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేత బిట్రగుంట

కావలి (జలదంకి): దేవ్ మెమోరియల్ (దేవరాజ్) ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా, రన్నర్‌గా బిట్రగుంట జట్లు నిలిచాయి. పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డీఆర్ క్రీడా ప్రాంగణంలో కావలి ఫుట్‌బాల్ అసోసియేషన్ (కేఎఫ్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన దేవ్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. శనివారం జరిగిన ఫైనల్ పోటీలో బిట్రగుంట ఏ జట్టు విన్నర్‌గా, బిట్రగుంట బీ జట్టు రన్నర్‌గా నిలిచాయి. సెమీ ఫైనల్స్‌లో నెల్లూరు, ఒంగోలు జట్లను బిట్రగుంట జట్లు ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఒంగోలు-కావలి మధ్యన జరిగిన లూజింగ్ సెమీ ఫైనల్స్‌లో కావలి జట్టు తృతీయస్థానం, ఒంగోలు జట్టు నాల్గో స్థానం దక్కించుకున్నాయి. ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన డిగ్రీ కళాశాల ఫుట్‌బాల్ క్రీడాకారుడు దేవరాజ్ జ్ఞాపకార్థంగా సహచర క్రీడాకారులు టోర్నీని నిర్వహించారు. జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి, ఆల్ ఇండియా ఉమెన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఎస్‌ఏ నవీద్ క్రీడాకారులను అభినందించి షీల్డులను అందజేశారు. టోర్నీలో పాలుపంచుకున్న దేవరాజ్ తల్లిదండ్రులు చిట్టిబాబు, సునీతకు క్రీడాకారులు, అతిథులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకులు శేషు, రాము, పరూక్, మనోజ్, తేజ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు అక్రమ కేసు !

కొండాపురం: మండలంలోని మర్రిగుంటకు చెందిన రేషన్ డీలర్‌పై కక్ష సాధింపులో భాగంగానే టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి అక్రమ కేసుకు తెర తీసినట్లుగా తెలుస్తోంది. రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారుల విచారణ లేకుండానే మర్రిగుంట డీలర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం, వీఆర్వోకు తెలియకుండానే ఆయనే రాత్రి 2.30 గంటల సమయంలో రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నట్లు ఎఫ్‌ఐఆర్‌లో పోలీసులు చూపించడం ఇందుకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఎఫ్‌ఐఆర్‌లో నలుగురు పోలీసు అధికారులు అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు నమోదు చేశారు. కానీ వాస్తవానికి ఆ రోజు మర్రిగుంట మీదుగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కొండాపురం పోలీసులు ఇద్దరు వచ్చి వాహనాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనికి తోడు ఘటనపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు రోజుకో మాట మారుస్తుండడం విమర్శలకు తావిస్తోంది. మర్రిగుంటలో రేషన్ బియ్యంపై విచారణ చేపట్టిన తహసీల్దార్ స్టాక్ సరిపోయిందని మీడియాకు తెలియజేశారు. అయితే గ్రామస్తుల సమక్షంలో విచారణ నివేదిక రాయకుండా, తన కార్యాలయంలో వేరే విధంగా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లుగా తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఓ రోజు ఓ విధంగా.. మరో రోజు ఇంకో విధంగా చెప్పడం కక్ష సాధింపు కుట్రకు బలం చేకూరుస్తోంది. కాగా ఈ విషయమై వీఆర్వో చెన్నకేశవులను వివరణ కోరగా గత ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చెప్పడంతో తనకు రేషన్ బియ్యం అక్రమ తరలింపు విషయం తెలిసిందన్నారు. శనివారం రాత్రి తాను లేనని, తనకు ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేసిన విషయానికి ఎలాంటి సంబంధం లేదని,ఎఫ్‌ఐఆర్‌లో ఏమి రాశారో కూడా తనకు తెలియదని తెలిపారు. ఇన్‌చార్జి ఎస్సై ఉమాశంకర్‌ను వివరణ కోరగా స్థానికులు రేషన్ బియ్యాన్ని పట్టుకుని తమకు సమాచారం ఇవ్వడంతో పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టామని, ఘటనా స్థలంలో తాము లేమని తెలిపారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

కలిగిరి: మండలంలోని తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన, ఎరుకులరెడ్డిపాళెం గ్రామాల్లోని రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వింజమూరు ఉద్యాన అధికారి షేక్ షహీల్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని తెలిపారు. ఉపాధి ద్వారా పండ్ల తోటలు, పూలమొక్కల సాగు, భూ అభివృద్ధి పనులకు అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు సన్నకారు సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, 1బీ, అడంగల్ పత్రాలతో గ్రామసచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఉజ్జీవ మహాసభలు

కలిగిరి: మండలంలోని వెంకన్నపాళెంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మూడ్రోజులుగా జరుగుతున్న ఉజ్జీవ మహాసభలు శనివారంతో ముగిశాయి. పాస్టర్ జయప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కమిటీ సభ్యులు రొద్దా నాగేష్, బెంజిమెన్, మహేష్, సల్మాన్, ప్రకాష్, విజన్య, తదితరులు పాల్గొన్నారు.